పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని గుర్తించాల్సిన బాధ్యత సంబంధిత ఉద్యోగులపై ఉందని ఏలూరు ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి ఎస్కే ఖాజావలి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షా పథకంపై పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక సూచనలందించారు. ఈనెల 30 నుంచి ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 29వ తేదీ నాటికి ఇంటింటికీ వెళ్లి బృందాలు సర్వే పూర్తి చేసి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. వారిని శిబిరాల్లో ప్రత్యేక వైద్యులు పరీక్షించి అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారికి ముందుగానే సమయాన్ని సూచించి వారికి కూపన్లు అందించాలన్నారు. ఎక్కడా కూడా రోగులు ఇబ్బంది పడకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో జరిగే శిబిరానికి ముందు రోజు విధిగా వైద్య ఆరోగ్య, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించుకోవాలన్నారు. శిబిరాల వద్ద వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎఎన్ఎం, ఆశావర్కర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఐసీడీఎస్ పీవో కె.విజయలక్ష్మీ, వైద్యులు బి.లీలా ప్రసాద్, శ్రీలక్ష్మీ, కల్యాణి మహేశ్వరీ, డిప్యూటీ తహసిల్దార్ షంషూద్దీన్, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భీమడోలు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎస్కే ఖాజావలి

శరవేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

పెదవేగి : గ్రామగ్రామానా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శరవేగంగా నిర్వహిస్తున్నారు. గురువారం పెదవేగి మండలం వంగూరులో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ సింహాద్రి శిరీష మాట్లాడుతూ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష భాగంగా వైద్యం అవసరమైన ప్రతి ఒక్కరికీ ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, కుటుంబానికి ఒక టోకెన్ ఇస్తున్నామని చెప్పారు. టోకెన్ పొందిన వారికి ఆయా గ్రామాల్లో నిర్దేశించిన సమయంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్‌లో ఉచితంగా వైద్యం, మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఉన్నారు.


వంగూరులోని ఓ ఇంట్లో మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


పోతునూరులో వృద్ధురాలికి వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి), ఎంపీటీసీ సున్నా నరేష్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ప్రతి ఇంట్లో అనారోగ్య సమస్యలున్న వారికి ఇంటి వద్దే వైద్య సేవలందించాలన్న దృఢసంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. గురువారం పంచాయతీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు సర్వం సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ విజయవంతానికి సర్వం సిద్ధం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోకవర్గ ప్రత్యేకాధికారి జీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. ఈ నెల 30న ప్రారంభించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి గురువారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వైద్య ఆరోగ్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న ఆరోగ్య సురక్షకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శుక్రవారం సాయంత్రానికి సర్వే పూర్తిచేయాలని అన్నారు. వైద్య శిబిరం వద్ద నలుగురు వైద్యులు అందుబాటులో ఉంటారని, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటలకే వైద్య శిబిరం ప్రారంభం కావాలన్నారు. తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు, ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్, డాక్టర్లు మాధవి, ప్రత్యూష, సీహెచ్ఓ రోజ్‌మేరీ, సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి: మండలంలోని భోగాపురం సచివాలయం పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు జానంపేట బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత

పెదవేగి: అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోన్న ఏలూరు సమీపంలోని పోణంగి గ్రామానికి చెందిన నందమూరి గాబ్రియేల్, మరియమ్మలకు అమ్మ సంస్థ సభ్యులు గురువారం రూ.8 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అమ్మ అసోసియేషన్ చైర్మన్ ఫాదర్ చుక్కా డొమ్నిక్, ప్రెసిడెంట్ చుక్క అవినాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యెర్నేని లేని లోటు తీరనిది

దెందులూరు: రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్ ఆకస్మిక మృతి తీరని లోటని రైతాంగ సమాఖ్య రాష్ట్ర నాయకులు ఇరుకులపాటి సాంబశివరావు అన్నారు. గురువారం గంగన్నగూడెంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాలుగా రైతులు, కౌలు రైతుల కోసం అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. యర్నేని చిత్రపటం వద్ద సాంబశివరావు, రైతులు నివాళులర్పించారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు


దెందులూరు ప్రాంతంలో ఊకలోడు వాహనం

దెందులూరు: గ్రామాల్లో, జాతీయ రహదారులపై భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ ఊకలోడు లారీలు, వాహనాలను రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రవాణా, ట్రాఫిక్ శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయానికి రోడ్డు నిర్మాణం


గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన రోడ్డు

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయానికి ఏటా ఉత్సవాలు ప్రారంభించే మార్గం నుంచి ఆలయం వరకు భక్తులు, వాహనాలు నేరుగా రావడానికి రోడ్డు నిర్మించారు. దాత శ్రీ మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ ఆర్థిక సాయంతో ఈ రోడ్డు నిర్మాణం చేశారు. దీంతో ఉత్సవాలకు, ఆలయానికి వచ్చే భక్తులకు, వాహనాలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

దుప్పట్ల పంపిణీ


అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అల్లు శ్రీను

ఉంగుటూరు: ఉంగుటూరులోని సాయిబాబా ఆలయం వద్ద 55 మంది అనాథలకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉప్పాకపాడు ఉపాధ్యాయుడు అల్లు శ్రీను గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు. అవార్డుతో పాటు తనకు లభించిన రూ.20 వేలు నగదులో కొంత మేర సొమ్ముతో ఈ కార్యక్రమం చేసినట్లు శ్రీను తెలిపారు. అల్లుశ్రీను భార్య నాగమణి పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనే మేలు

ఉంగుటూరు: ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టడం వల్లే ఆశించిన ఫలితాలు దక్కుతాయని ఏఓ బాలిన వెంకటేష్ అన్నారు. మండలంలోని రైతులు సామూహిక ఎలుకలు నిర్మూలన చేపట్టారు. ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాలు వద్ద బ్రోమెడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ గ్రామాల్లో తిరిగి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రైతులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలుక బొరియలు మెదటిరోజున మూసి ఉంచి తరువాత రోజున తెరిచిన కన్నాల వద్ద గురువారం మందును పెట్టారు.

తప్పు చేస్తే దైవానికి సమాధానం చెప్పాలి

గణపవరం: నీతినియమాలు వదిలి అసత్యాలు పలుకుతూ, అక్రమ మార్గంలో నడిచే వారు పలికే ప్రతి మాటకు, చేసే ప్రతి పనికీ దైవానికి సమాధానం చెప్పుకోక తప్పదని గణపవరం మసీదుపెద్ద గురువు అర్మాన్‌రజ అన్నారు. గురువారం మహ్మద్‌ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్‌నబీ పర్వదినం సందర్భంగా గురువారం గణపవరం మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవుల మార్గదర్శనం కోసం అల్లా అన్ని కాలాల్లో, అన్ని జాతులలో తన ప్రవక్తలను ప్రభవింపచేసి, గ్రంథాలను అవతరింపచేశారని అన్నారు. మానవుల సంక్షేమం కోసం, సాఫల్యం కోసం దైవం అవతరింపచేసిన హితోపదేశాలనే మహ్మద్ ప్రవక్త మానవాళికి అందజేశారన్నారు. మసీదు చిన్నగురువు ఫారూఖ్, మసీదు సంఘం అధ్యక్షుడు ఎండీ ఖాదర్‌ఖాన్, మహ్మద్ ఇస్మాయిల్, రహంతుల్లా, నాగూర్, షేక్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానంతో తూడు తొలగింపు


పంటకాల్వలో తూడు తొలగిస్తున్న రైతులు

గణపవరం: తమ పొలాలకు సాగునీరు అందకపోవడంతో రైతులంతా కలసి శ్రమదానంతో పంటకాల్వలో తూడు తొలగించుకున్నారు. కొందేపాడు గ్రామానికి అత్తిలి కాల్వ నుంచి కొమ్మర పంటకాల్వ ద్వారా సాగునీరు అందుతుంది. ఈ పంటకాల్వ నిండా తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సరిపడా నీరు అందడం లేదు. సాగునీరు సక్రమంగా అందక సుమారు 200 ఎకరాలలో వరిచేలు నీటి సమస్య ఎదుర్కొంటున్నాయి. అడపాదడపా వర్షాలు పడుతూ ఉండటంతో వరిచేలు ఎండిపోయే ప్రమాదం తప్పింది. నీరులేక పొలాలలో నేల గట్టిబడిపోవడంతో ఈనిక దశలో ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయం అత్తిలి ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామ సర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు చొరవతో ఆయకట్టు రైతులు గురువారం శ్రమదానంతో పంటకాల్వలో తూడు తొలగించుకున్నారు. దీంతో కొంతమేర సమస్య తీరినా పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు ఈ సమస్య నుంచి తమను గట్టెక్కించాలని కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొనే కార్యక్రమాలు

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం ఉదయం 9 గంటలకు పిప్పర గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవంలో పాల్గొంటారు. 10 గంటలకు గణపవరం డిగ్రీ కాలేజి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిర్వహించే వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారుల ఆటో ప్రదర్శనలో పాల్గొంటారు. 11 గంటలకు ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు భీమవరంలో జరిగే పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ సలహా సంఘం సమావేశంలో పాల్గొంటారని క్యాంపు కార్యాలయం ప్రతినిధి అడబాల రవి తెలిపారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనాలు

గణపవరం: వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలుచోట్ల గణనాథులను గురువారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పూలతో అలంకారం చేసిన ప్రత్యేక వాహనాలలో వినాయకుని విగ్రహాలను ఉంచి భక్తులు జయజయ ధ్వానాల మధ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు. తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, కేరళ డప్పులు, విచిత్ర వేషాలతో యువకులు డీజే వాయిద్యాలకు స్టెప్పులు వేస్తూ గణనాథులను గ్రామాలలో వీధివీధినా ఊరేగించారు. గణపతిబప్పా మోరియా అంటూ కాలువలు, చెర్వులలో నిమజ్జనం చేశారు. పలుచోట్ల గణపతి లడ్డూలకు వేలంపాట నిర్వహించి పాటదారులకు అందజేశారు. మండపాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు.


దెందులూరులో విఘ్నేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


బువ్వనపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

వినాయక ఊరేగింపు

దెందులూరు: నవరాత్రి ఉత్సవాల్లో పూజలు అందుకున్న విఘ్నేశ్వరస్వామి భారీ విగ్రహాన్ని గురువారం దెందులూరులో న్యూపాటి యూత్ ఆధ్వర్యంలో న్యూపాటి వీధి, రెండో వార్డు, బస్టాండ్ సెంటర్, గ్రంథాలయ సెంటర్, ఇండియన్ బ్యాంక్, 9వ వార్డుల్లో ఊరేగించారు. అనంతరం గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యతో అంధకారం

- 15 గంటల పాటు శ్రమించి సరఫరా పునరుద్ధరణ
- పర్యవేక్షించిన విద్యుత్ శాఖ ఎస్ఈ, అధికారులు

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అయితే సుమారు 15 గంటల పాటు సిబ్బంది శ్రమించి సరఫరాను పునరుద్ధరించారు. గత రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రేక్ డౌన్ తర్వాత సరఫరా ఇస్తుండగా ఒక్కసారిగా భీమడోలులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి 12 ఫీడర్లలో 9 ఫీడర్లు ఫాడయ్యాయి. దీని వల్ల సూరప్పగూడెం, గుండుగొలను సబ్‌స్టేషన్లుకు వెళ్లే కండక్టర్లు, తీగలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని గుండుగొలను, సూరప్పగూడెం, కోరుకల్లు, రత్నాపురం, వడ్డిగూడెం, ఆగడాలలంక, చెట్టున్నపాడు తదితర గ్రామాల్లోని విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం ఏర్పడింది.


భీమడోలులో విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ సాల్మన్‌రాజు

ఆ శాఖ అధికారులు వెంటనే స్పందించి పనులు చేపడుతుండగా భారీ వర్షం కురవడంతో తీవ్ర ఆటంకం కలిగింది. ఎస్ఈ సాల్మన్‌రాజు పర్యవేక్షణలో డీఈ శశిధర్, ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈ రామస్వామి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. గుండుగొలను, సూరప్పగూడెం గ్రామాలకు పోతునూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేశారు. గురువారం మధ్యాహ్నం వరకు సిబ్బంది శ్రమించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి అన్ని గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శలు


గుండుగొలనులో సత్యనారాయణరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


వెంకటకృష్ణారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


పెదకడిమిలో వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

భీమడోలు: మండలంలో ఇటీవల మృతి చెందిన, రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన వారిని గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. గుండుగొలనుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు చిలువూరి సత్యనారాయణరాజుకు రోడ్డు ప్రమాదంలో మోకాలు దెబ్బ తినడంతో ఆపరేషన్ తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను వాసుబాబు పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీమడోలు, పూళ్ల, కోడూరుపాడు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాల వారిని పరామర్శించి కుటుంబ సభ్యుల్లో ధైర్యాన్ని నింపి ప్రభుత్వం సాయం అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మగుంట భవానీ రంగ, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచ్‌లు దాయం సుజాత, పాము సునీతామాన్‌సింగ్, మానుకొండ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజు, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఎంపీటీసీలు గంటా శ్రీనివాసరావు, ఆల్తి గోపికృష్ణ, పొల్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శలు

పెదవేగి : పెదకడిమి, విజయరాయి గ్రామాల్లో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి గురువారం పరామర్శించారు. వారికి భరోసా కల్పించారు. పెదకడిమిలో శిరివరపు వెంకటేశ్వరరావు పెద్దకార్యంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. విజయరాయిలో ఇటీవల మృతి చెందిన గుణ్ణం రంగమ్మ ఇంటి వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ శ్రేణులు ఉన్నారు.

విజయవాడలో..

దెందులూరు: అనారోగ్యంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాయన్నపాలెంకు చెందిన కొనముట్ల వెంకట కృష్ణారావును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులను కోరారు.

రైతుల ఆర్థిక పరిపుష్టికి 'సహకారం'

భీమడోలు: సహకార రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పూళ్ల సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు (రాజీలు) అన్నారు. పూళ్ల సొసైటీలో గురువారం మహాజన సభ సమావేశం సొసైటీ అధ్యక్షుడు కందులపాటి రాజీలు అధ్యక్షతన జరిగింది. సొసైటీ కార్యదర్శి వి.చిన్నారావు సొసైటీ రైతులకు అందించిన సేవలను వివరించారు. కందులపాటి రాజీలు మాట్లాడుతూ పూళ్ల సొసైటీ రైతులకు అందించిన సేవలకు గుర్తింపుగా ఏలూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సొసైటీలో 2,392 సభ్యులుండగా వారి షేర్ ధనం రూ.1.2 కోట్లు ఉందన్నారు. కేంద్ర సహకార బ్యాంకు నుంచి పూళ్ల సొసైటీ రూ.18.70 కోట్లు అప్పు తీసుకుని రాగా రైతులకు రూ.23.40 కోట్లను రైతులకు రుణాలుగా అందించామన్నారు. సొసైటీలో రూ.86.80 లక్షల లాభాలను ఆర్జించామని, సంఘ సభ్యులకు 16శాతం డివిడెంట్లను అందిస్తామన్నారు. రైతుల ఆర్థిక పరిపుష్టిని సాధించేలా వారి సమస్యలను తక్షణమే పరిష్కారిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ సొసైటీగా నిలుపేందుకు కృషి చేసిన జిల్లా డైరెక్టర్ కందులపాటి రాజీలును అభినందించారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, పెద్దలు కేతినీడి విశ్వేశ్వరరావు, డైరెక్టర్ చింతా ఏసుబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల శేఖర్‌బాబు, రైతులు పాల్గొన్నారు.


పూళ్లలో సొసైటీ సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

భీమడోలు: హిందువులంతా ధర్మాన్ని వీడవద్దని, సనాతనమే శాశ్వతమని ప్రముఖ సనాతన ధర్మప్రచారకులు శ్రీమాన్ రాధా మనోహర్‌దాస్ అన్నారు. హిందువుల్లో ఐక్యత, చైతన్యాన్ని నింపే సంకల్పంతో గురువారం సాయంత్రం గుండుగొలనులో ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ పర్యవేక్షణలో హిందూ ధర్మపరిరక్షణ శోభాయాత్ర వైభవంగా జరిగింది. హిందువాదులు హిందు సంఘటిత బైక్ ర్యాలీని నిర్వహించారు. గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామివారిని ఆయన దర్శించుకుని బైక్ ర్యాలీ ప్రారంభించారు. హిందు మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని భారత్ మాతాజీ జై, జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుండుగొలనులో రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మనోహర్‌దాస్ ఉపన్యాసించారు. ప్రతి హిందువు ధర్మ పరిరక్షణకు నడుంబిగించాలన్నారు. భగవద్గీత, రామాయణంలోని హిందు ధర్మ గొప్పతనాన్ని, విశిష్ఠతను వివరించారు. సనాతనాన్ని వీడి హిందువులంతా మతం మార్చుకుంటూ విద్వేషాలకు పాల్పడుతున్నారన్నారు. హిందుత్వ విశిష్ఠత హిందువులంతా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఉప సర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు, సత్యసాయి సేవ సమితి జిల్లా మెడికల్ కన్వీనర్ కేఎల్ఎన్ మూర్తి, వార్డు సభ్యుడు నల్ల శంకర్ పాల్గొన్నారు.


శోభాయాత్ర బైక్ ర్యాలీలో పాల్గొన్న శ్రీమాన్ రాధామనోహర్ దాస్

అథ్లెటిక్స్‌లో మెరిసిన గురుకుల విద్యార్థినులు


విద్యార్థులు జిల్లా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కె.జయరాజు, ప్రిన్సిపల్ ఎం.పద్మావతి, పీడీ కృష్ణకుమారి తదితరులు

భీమడోలు: అంతర్ జిల్లాల సౌత్ జోన్ జూనియర్, సీనియర్ అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల స్పోర్ట్స్ స్కూలు విద్యార్థినులు 9 మంది సత్తా చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అంతేకాక వీరిలో వి.రంజిని, సీహెచ్ భార్గవీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోలసానిపల్లి బాలికల గురుకుల కళాశాలలో గురువారం సంబంధిత వివరాలను జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.జయరాజు, ప్రిన్సిపల్ ఎం.పద్మావతి వెల్లడించారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 హైజంప్ విభాగంలో డి.మహాలక్ష్మి కాంస్యం, అండర్-16 విభాగం 300 మీటర్ల పరుగులో వి.రంజని బంగారు, మూడు కిలోమీటర్ల నడకలో సీహెచ్ భార్గవీ వెండి పతకాలను సొంతం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరంగల్‌లోని హనుమకొండలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్-16 రెండు కి.మీ. పరుగులో జే.పల్లవి కాంస్యం, 800 మీటర్ల పరుగులో యు.అర్చన కాంస్యం, మిడిల్ రిలే పరుగులో ఎం.పూజ వెండి పతకాన్ని సాధించారు. అండర్-18 విభాగంలో 5 కేఎం నడక పోటీల్లో సి.రక్షిత నాగేశ్వరీ కాంస్యం, 2 కేఎం స్టీపుల్‌చేజ్ పోటీలో పి.సౌజన్య బంగారు, 2 కేఎం స్టీపుల్‌చేజ్ పోటీలో బి.నీలిమ వెండి పతకంతో పాటు మిక్సిడ్ రిలే (4 ఇన్‌టూ 400) పోటీలో బంగారు పతకాన్ని సాధించి తమ సత్తా చాటిందన్నారు. క్రీడాకారులను, పీడీ కృష్ణకుమారిని అభినందించారు. కళాశాల పీడీ సాయిలక్ష్మి, అధ్యాపక, అధ్యాకేతర సిబ్బంది పాల్గొన్నారు.